పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు

వికారాబాద్ : వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మార్చి 18 : పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, పదో తరగతి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, పోలీస్ స్టేషన్ కస్టోడియన్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల ఏర్పాటు, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 3 వరకు పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణలో పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

69 పరీక్షా కేంద్రాలు

పదో తరగతి పరీక్షల నిర్వహణకు మొత్తం 69 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 12,903 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరిలో బాలురు 6,450, బాలికలు 6,453 మంది ఉన్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు సెల్‌ఫోన్లకు అనుమతి ఇవ్వరాదన్నారు. కేంద్రాల నిర్వహణ, పరిశీలన కోసం 20మంది తహసీల్దార్లు, 20 మంది ఎంపీడీవోలు, 20మంది ఎంఈవోలు, 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 69 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 8 మంది పోలీస్ స్టేషన్ కస్టోడియన్స్, 13 మంది రూట్ ఆఫీసర్లు, 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 732 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు.

గంట ముందే చేరుకోవాలి

విద్యార్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి పరీక్ష సమయానికి గంట ముందు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒకరోజు ముందే పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలన్నారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. 5 నిమిషాలు ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇవ్వాలన్నారు. ఆ తర్వాత వచ్చిన విద్యార్థులను అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి వచ్చే ఎవరి దగ్గర కూడా మొబైల్ ఫోన్ ఉండేందుకు వీలు లేదన్నారు. ఏఎన్ఎంల దగ్గర కూడా ఉండడానికి వీలు లేదని వివరించారు. పరీక్ష కేంద్రంలోకి నిర్వహణ సిబ్బంది, స్క్వాడ్స్ తప్పా ఇతరులకు ప్రవేశం లేదన్నారు. ప్రతి విద్యార్థినీ క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. బాలురు, బాలికలకు ప్రత్యేకంగా తనిఖీ చేసే ఉపాధ్యాయులను టీమ్‌లుగా ఏర్పాటు చేయాలని సూచించారు.

నిర్దేశించిన సమయానికి..

ప్రశ్నాపత్రాన్ని నిర్దేశించిన సమయానికి స్వయంగా సీఎస్, డిపార్ట్‌మెంటల్ అధికారి ప్రతి రూమ్‌కు తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. పరీక్షకు గైర్హాజరైన విద్యార్థుల ప్రశ్నాపత్రాలను వెంటనే తీసుకొని వాటిని భద్రంగా దాచి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ ప్రహరీ సరిగా లేని దగ్గర పోలీస్ సిబ్బందిని అదనంగా నియమించుకోవాలన్నారు. పరీక్షకు ముందు రోజు సీఎస్, డీవోలు ఇన్విజిలేటర్లతో సమావేశమై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, లైటింగ్, ఫ్యాన్లు ఉండేలా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు సిబ్బంది ఎవరూ సెలవులు వాడుకోరాదన్నారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ ఫోన్ 08416 235245 నంబర్‌కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఈవో రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 249 పరీక్షా కేంద్రాలు

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 21నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 249 పరీక్షా కేంద్రాల్లో 51,766మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపించాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా బస్సు సర్వీసులను నడపాలన్నారు. ఆయా కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు తాగునీరు, తగిన ఫర్నిచర్ కేంద్రాల్లో ఉండేలా ఈ రెండు రోజుల్లో తనిఖీ చేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

వికారాబాద్ డిపోకు 16 బస్సులు

శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, మార్చి 18 : వికారాబాద్‌లోని ఆర్టీసీ బస్ డిపోకు నూతనంగా 16 బస్సులు కేటాయించామని శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో వికారాబాద్ డిపోకు మరిన్ని కొత్త బస్సులను కేటాయించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరామని తెలిపారు. ఈ మేరకు 16 కొత్త బస్సులను మంజూరు చేశారన్నారు. నూతన బస్సుల అందుబాటులోకి వస్తే వికారాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రయాణికులకు ప్రయాణం సులభతరం కానున్నదన్నారు.

అసెంబ్లీ పరిధిలో బీఎల్ఏలను నియమించాలి

సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొడంగల్, మార్చి 18 : అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బీఎల్ఏలను నియమించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఫామ్ 6, 7, 8 ప్రకారం బూత్ లెవల్ వారీగా బీఎల్ఏలను నియమించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి రైతుల పేర్లు తొలగించాలి

- 27, 28న మేడిపల్లి నుంచి కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర
- సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

సమావేశంలో మాట్లాడుతున్న పగడాల యాదయ్య

యాచారం, మార్చి 18 : ఫార్మాసిటీ భూములు ఇవ్వని బాధిత రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. యాచారంలో మంగళవారం సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ బాధితులకు మద్దతుగా ఈ నెల 27, 28న మేడిపల్లి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రైతులతో కలిసి పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఫార్మాసిటీకి ఇవ్వని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, ఆన్‌లైన్‌లో టీఎస్ఐఐసీ పేరు తొలగించి రైతుల పేర్లను నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు, రుణమాఫీ వర్తించేలా చేయాలని కోరారు. రైతులు తమ భూములను అమ్మకోవడానికి వీలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం బలవంతపు భూ సేకరణ ఆపాలని యాదయ్య డిమాండ్ చేశారు. రైతులకు అదనపు పరిహారంగా కేటాయించిన ప్లాట్లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఫార్మా బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఫార్మాసిటీ గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. పారిశ్రామిక వాడకోసం మొండిగౌరెల్లిలో చేపట్టనున్న భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. ఫార్మా బాధిత రైతులకు సీపీఎం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, పెద్దయ్య, జగన్, జంగయ్య, బ్రహ్మయ్య, చందునాయక్, విప్లవ్‌కుమార్, తావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు అందక.. ఎండుతున్న పంట

- బండలేమూరులో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చేతికి వచ్చిన పంట పశువులకు మేత

బండలేమూరులో ఎండిపోయిన వరి పంటను మేకలకు మేపుతున్న రైతు

మంచాల, మార్చి 18 : కేసీఆర్ సీఎంగా ఉన్న పదేండ్లలో వ్యవసాయం పండుగలా సాగింది. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే కరువు ఒక్కసారిగా విలయతాండవం చేయడంతో పంటలు ఎండిపోతున్నాయని.. వాటి సాగుకు తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదని మండలంలోని బండలేమూరు గ్రామంలోని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. భూగర్భజలాలు అడుగంటుతుండడంతో బోరుబావుల్లోని నీరు తగ్గి పంట ఎండిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండిన పొలాల్లో పశువులు, మేకలు, గొర్రెలను మేపుతున్నారు.

అప్పులే మిగిలాయి..

కేసీఆర్ ఉన్నప్పుడు చేతి నిండా పని ఉండే. ఎప్పుడు ఖాళీగా ఉండేది కాదు. నాకు ఉన్న నాలుగు ఎకరాల్లో వరిని సాగు చేసుకుని సంతోషంగా జీవించా. అయితే, రేవంత్‌తో పాటు రాష్ట్రంలోనూ కరువు వచ్చింది. ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడంతో అప్పులు చేసి పంటను సాగు చేశా. ఇప్పుడు బోర్లల్లో నీళ్లు తగ్గిపోయి పంట మొత్తం ఎండిపోతున్నది. పెట్టిన డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదు. అప్పులే మిగిలాయి.

-వర్త్యా లాలూ (బండలేమూరు)

మూడు బోర్లు తవ్వించినా..ఫలితంలేదు..

నాకు రెండెకరాల పొలం ఉన్నది. ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకపోవడంతో రూ. 30 వేలు అప్పు చేసి వరి పంటను సాగు చేశా. నా పొలంలో ఏడాది కాలంలోనే మూడు బోర్లు వేయించా. అందులోని ఒక్క బోరు నుంచి నీళ్లు రావడంతో వరి పంట వే శా. ఇప్పుడు ఆ బోరు నుంచి నీరు రాకపోవడంతో పంట ఎండిపో తున్నది. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో.. అప్పులు ఇచ్చిన వారికి ఏమి చెప్పాలో అర్థం కావడం లేదు. గత పదేండ్లలో ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు. కేసీఆర్ హయాంలో వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండడంతో బోరుబావుల్లో నీళ్లు పుష్కలంగా ఉండేవి. అప్పుడు పంటలను సాగు చేసుకుని సంతోషంగా జీవించాం.

-వర్త్యా బాల్‌రాజు(బండలేమూరు)

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్
- రెండో రోజు కలెక్టరేట్ ఎదుట కొనసాగిన అంగన్‌వాడీల ధర్నా
- రాత్రి బస.. ఉదయం వంటా వార్పుతో నిరసన

ఆదిబట్ల : రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట రెండో రోజు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

ఆదిబట్ల, మార్చి 18 : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట తెలంగాణ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్నా మంగళవారం కూడా కొనసాగింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆ యా కేంద్రాలకు తాళం వేసి ధర్నాలో పాల్గొన్నారు. సోమవారం రాత్రి ధర్నా అనంతరం అక్కడే బస చేశారు. ఉదయం వంటా వార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయలన్నారు. సీఐటీయూ నాయకులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఐసీడీఎస్ డీడబ్ల్యూ అధికారి హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జగదీశ్, రుద్రకుమార్, డి కిషన్, సహాయ కార్యదర్శులు దేవేందర్, స్వప్న, కమిటీ సభ్యులు ఎల్లేశ్, కృష్ణ, టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, జిల్లా కార్యదర్శి కవిత, కోశాధికారి లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.18వేల వేతనం ఇవ్వాలి

వికారాబాద్ : కాంగ్రెస్ పరభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీల ప్రకారం. అంగన్‌వాడీలకు రూ.18వేల వేతనం పెంచాలని అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, లక్ష్మి తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని 40గంటల పాటు ధర్నా నిర్వహించారు. సోమవారం ధర్నా నిర్వహించారు. రాత్రి అక్కడే బస చేశారు. వంటా వార్పు చేశారు. మంగళవారం సాయంత్రం వరకు కార్యక్రమాన్ని కొనసాగించారు. అనంతరం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ అంగన్‌వాడీలకు మద్దతు పలికారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా కార్యదర్శులు భారతి, విజయలక్ష్మి, నవనీత, మంజుల, సరిత తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ : అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పులి పిల్లకాదు.. అడవి పిల్లి

సీసీ కెమెరాకు చిక్కిన అడవి పిల్లి

తాండూరు రూరల్, మార్చి 18: మండల పరిధిలోని మల్కాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీలోని క్వారీల్లో ఇటీవల పులిపిల్ల ఆకారం ఉన్న ఓ జంతువు కనిపించింది. అటవీ శాఖ అధికారిణి శ్రీదేవి, సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆయా ప్రాంతాల్లో ట్రాప్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మంగళవారం అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలకు అడవి పిల్లి చిక్కింది. దాంతో అటవీ శాఖ అధికారులు, ఫ్యాక్టరీ యాజమాన్యం, చుట్టు పక్క ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నేను పాఠశాల స్లాబ్‌పైనే ఉన్నా.. ఎక్కడికీ వెళ్లలేదు..

గిరిజన గురుకులం నుంచి అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో అదృశ్యమైన బాలుడు శంకర్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఆర్‌సీవో సుధాకర్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 18 : మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో ఈ నెల 14న అదృశ్యమైన తొమ్మిదో తరగతి విద్యార్థి శంకర్ ఆచూకీ లభ్యమైందని ఎస్సై అన్వేశ్‌రెడ్డి తెలిపారు. స్కూల్ నుంచి కనిపించకుండా వెళ్లిన విద్యార్థిని ఎక్కడికెళ్లావని అడుగగా.. తాను పాఠశాల స్లాబ్‌పైనే ఉన్నానని, తన వద్ద ఉన్న బిస్కెట్లు తిన్నానని సమాధానమిచ్చినట్లు ఎస్సై చెప్పారు. కాగా మంగళవారం ఉదయం పాఠశాల ప్రాంగణంలో ఆ విద్యార్థి కనిపించడంతో మిగిలిన స్టూడెంట్స్ ప్రిన్సిపాల్‌కు చెప్పగా.. ఆయన ఆ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తన అదృశ్యం వెనుక ఎవరి ఒత్తిడి, ప్రమేయం లేదని విద్యార్థి శంకర్ చెప్పాడు. కాగా, విద్యార్థికి గురుకుల ఆర్‌సీవో సుధాకర్, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు తరలిపోతుండగా పోలీసులు అరెస్ట్ చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఆదిబట్ల నాయకులు జంగయ్య, శ్రీకాంత్, తిరుమల్‌రెడ్డి అన్నారు. వీరిని ఆదిబట్ల పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. - ఆదిబట్ల, మార్చి 18

లా కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మాని యా యూనివర్సిటీ పరిధిలోని లా కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్బీ, ఐదేళ్ల బీకాం ఎల్ఎల్బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్బీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎల్ఎల్ఎం మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీ ల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు

నిమ్స్ సెక్యూరిటీకి భద్రత కరువు

నిమ్స్‌లో నిరసన తెలుపుతున్న సెక్యూరిటీ గార్డులు

రూ.3కోట్లు గోల్‌మాల్ చేసిన ఏజెన్సీకి సెక్యూరిటీ బాధ్యతలు..!

ఖైరతాబాద్, మార్చి 18 : నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది జీవితాలకు భద్రత కరువైంది. నిత్యం వేలాది మంది రోగులు, వారి సహాయకులతో పాటు డైరెక్టర్ మొదలు వార్డు బాయ్‌ల వరకు అందరికీ రక్షణగా నిలిచే సెక్యూరిటీ గార్డుల పరిస్థితి దయనీయంగా మారింది. 24/7 గంటలు ఆస్పత్రి భద్రతను పర్యవేక్షించే సెక్యూరిటీ గార్డులను మాత్రం పట్టించుకునే వారే కరువయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిమ్స్ దవాఖానలో సెక్యూరిటీ గార్డుల వేతనాల వెతలు కొత్తవి కాదు. ఏజెన్సీలు ఎన్ని మారినా రెండు నెలలకు, మూడు నెలలకోసారి వేతనాలు అందించడం పరిపాటిగా మారిపోయింది. గతంలో ఓ ఏజెన్సీ నిమ్స్ సెక్యూరిటీ గార్డులకు చెల్లించాల్సిన లక్షలాది రూపాయల పీఎఫ్ డబ్బులను దిగమింగింది. కానీ ఇప్పటి వరకు యాజమాన్యం ఎలాంటి విచారణకు ఆదేశించకపోగా, మళ్లీ అలాంటి సంస్థలకే బాధ్యతలు ఇస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ని ఏజెన్సీలు మారినా.. వేతనాలు సరిగా చెల్లించకుండా మోసగించే ఏజెన్సీలకే పదే పదే బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న రహస్యం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు సెక్యూరిటీ గార్డులు వాపోతున్నారు. ప్రస్తుతం కార్తికేయ, ఓపీడీఎస్ఎస్ (ఓం సాయి ప్రొఫెషనల్ డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్) సంస్థలు నిమ్స్ సెక్యూరిటీ బాధ్యతలను చూసుకుంటున్నాయి. కాగా, మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా తాత్సారం చేస్తూ సెక్యూరిటీ గార్డుల విధుల బహిష్కరణ, నిరసనకు కారణమైన సంస్థ మాత్రం గతంలో సుమారు మూడు కోట్ల పీఎఫ్ డబ్బుల గోల్‌మాల్‌కు పాల్పడిందన్న ఆరోపణలు బహిరంగానే వినిపిస్తున్నాయి. ఆ సంస్థకు ఈ విషయంపై కార్మిక శాఖ నుంచి నోటీసులు సైతం అందినట్లు సమాచారం. మంగళవారం మరో సారి విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.

ఏజెన్సీలే ఆలస్యం చేస్తున్నాయి

నిమ్స్ సెక్యూరిటీ గార్డుల సమస్య తమ దృష్టికి వచ్చింది. ఏజెన్సీ గురించి కూడా పూర్తి సమాచారం ఉంది. కాంట్రాక్ట్ ఏజెన్సీ సకాలంలో బిల్లులు పెట్టడం లేదు. గతంలోనూ ఆలస్యం చేయడం వల్లే వారి వేతనాల చెల్లింపులో ఆలస్యమైంది. నిమ్స్ ఆస్పత్రి తరపున ఎలాంటి సమస్య లేదు. ఏజెన్సీ వారే పీఎఫ్ లెక్కలతో కూడిన బిల్లులు అందించకపోవడం వల్లే ఈ సమస్య ఎదురవుతున్నది. వారి వేతనాలు సకాలంలో చెల్లించేలా చొరవ తీసుకుంటాం.

-డాక్టర్ బీరప్ప,
డైరెక్టర్, నిమ్స్ హాస్పిటల్